రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజావాణీ కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజాసమస్యలను అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్,జడ్పి సీఈఓ జానకి రెడ్డి,డిఆర్‌డిఓ కృష్ణన్,వికారాబాద్ ఆర్డీవో విజయ్ కుమారిలతో కలిసి 266 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు.ఇట్టి దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రధాన్యతను ఇచ్చి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని,పెండింగ్‌లో ఉంచరాదని అన్నారు.అంతకుముందు జిల్లా ఐడిఓసి గార్డెన్‌కు ఉత్తమ గార్డెన్‌గా ఎంపిక కావడం పట్ల జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి హార్ష వ్యక్తిపరిచారు.కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పరిశుభ్రత,గార్డెనింగ్ పనులను ప్రతిరోజు చేపట్టి వచ్చిన అవార్డును నిలబెట్టుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అందజేసిన ట్రోఫీని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా హార్టికల్చర్ అధికారులకు అందజేశారు.ఈ మాసం కూడా గత మాసం లాగానే అటెండెన్‌నస యాప్‌కు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ప్రభుత్వ ఉద్యోగులందరికి అటెండెన్స్ యాప్ ఆధారంగానే ఈ మాసం కూడా జీతభత్యాలు చెల్లించడం జరుగుతుందన్నారు.ఈ విషయంలో అధికారులు,గట్టిగా ముందకు వెళ్లలన్నారు.గత వారం ఎస్సీ,ఎస్టి,బిసి సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డా.బాబు జగ్జీవన్ రామ్,మహాత్మ జ్యోతిబాపూలే ,డా బిఆర్ అంబేద్కర్ మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని ప్రశంసించారు.ప్రోటోకాల్ విషయంలో ఎలాంటి తప్పులు జరగకుండా పద్దతి ప్రకారంగా పాటించాలని అన్నారు.

### రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో....

చేవెళ్ల ఏప్రిల్ 17,ప్రభాతవార్త : ప్రజావాణిలో స్వీకరించిన పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ సంబందిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ అధికారి హరిప్రియ వివిధ ప్రాంతాల నుండి ప్రజల నుండి సమస్యలను స్వీకరించారు.ఈ సందర్బంగా రంగారెడ్డి జిల్లా రెవె న్యూ అధికారి హరిప్రియ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబందిత అదికారులకు సూచించారు. స్వీకరించిన అర్జిలను నిర్లక్ష్య చేయకుండా పరిశిలించి సమస్యలను పరిష్కరించాలన్నారు.సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినఅధికారులపై చర్యలు తీసకుంటామన్నారు. ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు 90 పిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఓ ప్రమీల తదితరుల శాఖల అధికారులున్నారు.



-ప్రజావాణిలో పిర్యాదులను స్వీకరిస్తున్న రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ

## లక్ష్మారావుగూడలో ఘనంగా బీరప్ప బోనాలు

**షాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని లక్ష్మారావుగూడ గ్రామంలో సోమవారం బీరప్ప బోనాలు కన్నులపండువగా జరిగాయి. గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకుని బీరప్ప స్వామికి నైవేద్యం సమర్పించారు. దారిపొడవున పోతురాజుల విన్యా సాలు, శివసత్తుల పూనకాలు అల రించాయి. ఉత్సవాల్లో గ్రామస్థులు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి బయలుదేరిన గ్రామస్థులు

# ప్రారంభోత్సవానికి నోచుకోని ట్రాఫిక్ సిగ్నల్

-రాజీవ్ చౌరస్తాలో ప్రమాదకరంగా మారిన ప్రయాణం
-ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ప్రయాణాలు
-అడ్డుకట్ట లేక వేగంతో దూసుకుపోతున్న వాహనాలు
-ఆమనగల్లుకు రావడానికి ఆసక్తి చూపని ట్రాఫిక్ సిబ్బంది?
-అందుకే ఏడాదిగా సిగ్నల్ ప్రారంభోత్సవానికి జాప్యం?
-పట్టించుకోని పాలకులు, ఉదాసీన వైఖరిలో అధికారులు



ఆమనగల్లు రాజీవ్ చౌరస్తాలో దిష్టిబొమ్మలుగా దర్శనం ఇస్తున్న ట్రాఫిక్ సిగ్నల్

**ఆమనగల్లు, ఏప్రిల్17, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి 765పై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ ప్రారంభోత్సవానికి ఎదురు చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. పనులు పూర్తి చేసుకుని ఏడాది గడుస్తున్నా ప్రారంభోత్సవంలో అలసత్వం ఏర్పడి జాతీయ రహదారిపై ట్రాఫిక్ సిగ్నల్‌లు దిష్టిబొమ్మలుగా దర్శనం ఇస్తున్నాయి. ఆమనగల్లుకు రావడానికి ట్రాఫిక్ సిబ్బంది ఆసక్తి చూపకపోవడంతో సిగ్నల్ ప్రారంభోత్సవం జాప్యం జరగడానికి కారణంగా విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకుల పట్టింపులేని ధోరణి, అధికారుల ఉదాసీనత వైఖరీ ప్రజలకు శాపంగా మారింది. పూర్తి వివరాలలోకి వెళితే...ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి 765పై గల రాజీవ్ కూడలి హైదరాబాద్-శ్రీశైలం, మాడ్గుల- షాద్‌నగర్‌ల చౌరస్తా (రాజీవ్ చౌరస్తా) నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజురోజుకు పెరుగుతున్న వాహనాలతో చౌరస్తా నిత్యం రద్దీగా దర్శనం ఇస్తుంటుంది. ముఖ్యంగా హైదరాబాద్-శ్రీశైలం వైపు వాహనాలు రాకపోకలు అధికంగా ఉంటాయి. పట్టణంలోనే ముఖ్య కూడలి కావడంతో ఇక్కడి ప్రాంతం వాణిజ్య కేంద్రంగా పేరుగాంచింది. దీంతో వచ్చిపోయే వాహనాలతోపాటు బాటసారులు, చిరువ్యాపారంతో ఈప్రాంతం జనంతో కిటకిటలాడుతుంది. వేల సంఖ్యలో వాహనాలు అటూ ఇటూ రోడ్డు దాటు క్రమంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎదురుగా వాహనాలు దూసుకువస్తున్నా పట్టించుకోకుండా లేక ఇతర వాహనాలు, బాటసారులు రోడ్డు దాటేందుకు ప్రయత్నించడం ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారి ఇరువైపుల వాహనాలు అతివేగంతో దూసుకుపోతున్నాయి. జనసమూహంను గమనించకుండానే వాహనాలు నిర్లక్ష్యంతో వేగంతో దూసుకువచ్చి ప్రమాదాలు చేస్తున్నాయి. గత 6నెలల కాలంలోనే ఈప్రాంతంలో దాదాపు 10 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వేగంతో దూసుకుపోతున్న వాహనాలను గమనించకుండానే మాడ్గుల-షాద్‌నగర్ వైపు వాహనాలు చౌరస్తా మధ్యలోకి వచ్చి చేరిపోతున్నాయి. ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు రోజుకు కోకొల్లలుగా మారాయి. సమీపంలోనే ఆర్టీసీ బస్టాండ్ ఉండడంతో ఆసంస్థ వాహనాలు మలుపు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కుంటున్నాయి. ఒకవైపు వీధివ్యాపారం, మరోవైపు అడ్డుగోలు పార్కింగ్‌తో రాజీవ్ చౌరస్తా గజిబిజిగా దర్శనం ఇస్తుంటుంది. దీంతో వేగనియంత్రణ లేక ఈప్రాంతంలో ఇప్పటికే పలు రోడ్డు ప్రమాదాలు జరిగిన సంధర్భాలు ఉన్నాయి. కొంతమంది ప్రాణాల మీదకి తెచ్చుకోగా మరికొంత మంది క్షతగాత్రులుగా మిగిలిపోయారు. కాగా ఈరోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ అధికారులు, స్థానిక పోలీసులు సమన్వయంతో రాజీవ్ చౌరస్తా కూడలిలో సిగ్నల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి గతేడాది పనులకు శ్రీకారం చుట్టారు. నిబంధనల మేరకు హైదరాబాద్-శ్రీశైలం, మాడ్గుల-షాద్‌నగర్ రహదారుల నాలుగు వైపుల పోల్స్ బిగించి వాటికి సిగ్నల్ లైట్స్‌ను బిగించారు. ఆరెంజ్ లైట్‌తో పాటు గ్రీన్, రెడ్ లైట్‌లు ఏర్పాటు చేసి సిగ్నల్ సమయాన్ని సైతం కేటాయించి ప్రారంభోత్సవానికి సర్వం పూర్తి చేశారు. అయితే అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అనే ఛందంగా లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేసుకున్నా ట్రాఫిక్ సిబ్బంది లేక వాటిని ప్రారంభించలేకపోతున్నారు. సిగ్నల్ వద్ద కావలసిన ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించడంలో అధికారులు ఉదాసీనత వైఖరి అవలంభించడంతో ఏడాది నుండి సిగ్నల్ స్థంభాలు దిష్టిబొమ్మలుగా మారాయి. నగరానికి 60కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆమనగల్లు పట్టణంలో విధులు నిర్వహించడానికి ట్రాఫిక్ సిబ్బంది ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సిబ్బంది కొరతతో సిగ్నల్ ప్రారంభోత్సవం జాప్యానికి కారణమని పట్టణంలో బహిరంగంగా వినిపిస్తున్నది. దానికి అధికారుల ఉదాసీనత వైఖరి తోడు కావడంతో సిగ్నల్‌కు గ్రహణం పట్టిందని ఆరోపిస్తున్నారు. పట్టించుకోవలసిన ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో నగరంలో ఉన్న పై అధికారులపై ఒత్తిడి లేక ఆమనగల్లు ట్రాఫిక్ సిగ్నల్ ప్రారంభోత్సవం గాలికి వదిలివేసారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షలు వెచ్చించి అన్ని పనులు పూర్తి చేసుకున్న ప్రజాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారిపై రేలింగ్ ఏర్పాటుతో ప్రస్తుతం రోడ్డు నిబంధనలు ఎవ్వరూ పాటించడంలేదన్నారు. రాంగ్ రూట్ డ్రైవ్‌లు, అతివేగం, రోడ్డు క్రాస్ వంటి వాటితో రాజీవ్ చౌరస్తా నిత్యం ప్రమాదకరంగా తలపిస్తున్నది. స్థానిక పోలీసులు కూడా చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడంతో రాజీవ్ చౌరస్తాలో వాహనాలు తరుచూ ట్రాఫిక్ సుడిగుండంలో ఇరుక్కుంటున్నాయి. నాలుగు దిక్కుల నుండి వస్తున్న వాహనాలు ఎటువైపు వెళ్ళుతున్నాయో అర్థంకాక అయోమయానికి గురికావలసి వస్తున్నది. చౌరస్తా మధ్యలో ఇరుక్కుపోయిన వాహనాలు ట్రాఫిక్ జాంకు కారణమవుతున్నాయి. కాగా చౌరస్తా సమీపంలోనే పలు పాఠశాలలు ఉండడంతో నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు రోడ్డు దాటడంలో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ట్రాఫిక్ సిగ్నల్ ప్రారంభిస్తేనే ఆమనగల్లు రాజీవ్ చౌరస్తాలో ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పట్టించుకుని ట్రాఫిక్ సిగ్నల్‌ను ప్రారంభించేలా చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా ముగిసిన చీర్యాల లక్ష్మీనృసింహస్వామి పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలు



చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి పంచదశ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూర్ణాహుతిలో పాల్గొన్న ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న నక్క ప్రభాకర్‌గౌడ్‌కి స్వామి వారి చిత్ర పటాన్ని అందిస్తున్న ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ

**కీసర, ఏప్రిల్17, ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలు యాదాద్రి ప్రధాన అర్చకులు నల్లంథఘళ్ లక్ష్మీనరసింహ్మాచార్యులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ముగిసాయి.పంచదశవ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటలకు నిత్య పూజా కార్యక్రమాలు, 7.30 నుండి యజ్ఞ కార్యక్రమాలు,8 గంటలకు మహ పూర్ణాహుతి,9 గంటల నుండి శతఘటాభిషేకం,అలంకరణ,పంచహరతులు,నివేదన శాత్తుముఱై,చక్రస్నానం,తీర్థప్రసాద గోష్టి,సాయంత్రం 5.30 గంటలకు సామూహిక శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, సాయరాధన, ఋత్విక్ సన్మానం,యాజమాన్య ఆశీర్వచనము, నివేదన,శాత్తుముఱై, మంగళశాసనము,తీర్థ ప్రసాద గోష్టి,స్వామివారి పల్లకిసేవ,పవలింపు సేవ కార్యక్రమాలతో పరిసమాప్తి తదితర పూజా కార్యక్రమాలతో పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయి.శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో మూడు రోజులు నిత్య అన్నదానం కార్యక్రమం,ముషిరాబాద్ కేర్ ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పటు చేయడం జరిగిందని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు.మూడు రోజులు బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ఎప్పటికప్పుడు ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచిన పారిశుద్ధ్య కార్మికులకు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి మల్లారపు ఇందిర,ఫౌండర్ ట్రస్టీ శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీనృసింహ్మా స్వామి సేవలో నక్క ప్రభాకర్‌గౌడ్:**
చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం బిఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.ఆలయ మహమండపంలో శాలువాతో సన్మానించి స్వామివారి చిత్ర పటాన్ని అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఉపాధిహామీ కూలీలను చైతన్యం కల్పించాలి : కలెక్టర్

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ కూలీలను చెతన్యం కల్పిస్తూ ,లక్ష్యం మేరకు కూలీల సమీకరణ జరగాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు.సోమవారం జిల్లాలోని అందరూ ఏపిఓలతో ఉపాధి హామీ కూలీల సమీకరణ లక్ష్యాలు,చేపట్టిన పనులపై డిఆర్‌డిఓ కృష్ణన్‌తో కలిసి టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఉపాధి హామీ కూలీల సమీకరణ లక్ష్యం తక్కువగా ఉందన్నారు. ఇట్టి లక్ష్యాలను పూర్తి చేసి అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి చెరువు కింద ఇరిగేషన్ క్యానల్ పనులతో పాటు గ్రామ కంఠం పనులు, రెండు కిలోమీటర్ల రోడ్డు ఫార్మేషన్ పనులను చేపట్టాలన్నారు.చేపట్టే పనులన్ని నాణ్యతగా ఉండాలని,మే మాసంతం వరకు మంచి పనులు చేపట్టాలని సూచించారు.ప్రతి రెండు రోజులకు ఒకసారి పనులపై సమీక్షిస్తానని తెలిపారు.పనులలో నిర్లక్ష్యం వహించరాదనిఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

### సీఈఐఆర్ అప్లికేషన్‌ను వినియోగించి సెల్‌ఫోన్ దొంగల భరతం పడుదాం
-జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి

**వికారాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** సీఈఐఆర్ అప్లికేషన్ ను వినియోగించి సెల్ ఫోన్ దొంగల భరతం పడుదామని జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి అన్నారు. చోరికి గురైన, పోగొట్టుకున్న చరవాణి లను క ఎగొనేందుకు కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ నూతన అప్లికేషన్ ను తీసుకురావడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ విషయమై జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లకు, రిసిప్షనిస్ట్ లకు, ఎస్సై లకు సీఈఐఆర్ కొత్త అప్లికేషన్ పై ఆన్లైన్ మీటింగ్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సీఈఐఆర్ అప్లికేషన్ ముఖ్యంగా మొబైల్ ఫోన్ పోయినప్పుడు అట్టి మొబైల్ ఫోన్ కనుక్కోడానికి చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుత జీవన విధానంలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని తెలిపారు. చోరికి గురైన ఫోన్‌లను, పోగొట్టుకున్న ఫోన్ లు వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని పేర్కొన్నారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన సీఈఐఆర్ అనే అప్లికేషన్ ద్వారా చరవాణి ఎక్కడైనా పోగొట్టుకున్న, చోరికి గురైనా అట్టి చరవాణిలు వెతికి పట్టుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలో సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ అప్లికేషన్ వినియోగించుకునేందుకు సంబంధిత వెబ్ సైట్ లో లాగిన్ కావాలని సూచించారు. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ సమాచారం మేరకు వివరాలు అన్ని అప్‌లోడ్ చేశాక ఒక ఐ.డి నెంబర్ వస్తుందని, తదనంతరం పోగొట్టుకున్న ఫోన్ స్టేటస్ తెలుసుకోవచ్చని తెలిపారు. మొబైల్ ఏ కంపెనీదైనా సీ.ఈ.ఐ.ఆర్ అప్లికేషన్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్ పని చేయకుండా చేస్తుందని పేర్కొన్నారు. చరవాణి దొరికిన తర్వాత సైతం వినియోగదారుడు అదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్ బ్లాక్/ఫౌండ్ మొబైల్ అనే లింక్ పై క్లిక్ చేయాలని, దీంతో ఫోన్ అన్ బ్లాక్ అవుతుందతని తెలిపారు. చరవాణి పోయిన వెంటనే వారి పరిధిలోని పోలీస్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. సీఈఐఆర్ అప్లికేషన్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి : రేవంత్ రెడ్డి

**కొడంగల్,ఏప్రిల్ 17ప్రభాతవార్త**
కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని పీసీసీ అద్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు.సోమవారం కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని కొడంగల్,కోస్గీ మండలాలకు చెందిన పార్టీ నాయకులు పీసీసీ సభ్యులు ఎండీ.యుసుఫ్,కొడంగల్ నయ్యూం,అశ్వాక్,అసీఫ్‌ఖాన్ తదితరులు హైద్రాబాద్‌లోని ఆయన స్వగృహంలో రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్బంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న హాత్‌సే హాత్ జోడో యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణపై నాయకులు రేవంత్‌రెడ్డికి వివరించారు.అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతు ఎన్నికలు సమీస్తున్న తరుణంలో నాయకులు,కార్యకర్తలు ప్రజలతో మమేకమై బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతు గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.త్వరలోనే తాను కొడంగల్ నియోజకవర్గంలో పర్యటిస్తానని నాయకులకు తెలిపారు.



పీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డిని కలిసిన కొడంగల్ కాంగ్రెస్ నాయకులు

## అనుమానంతో ప్రేమించిన యువతి దారుణ హత్య

-చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు
-వివరాలు వెల్లడించిన డిసిపి నారాయణ రెడ్డి



**శంషాబాద్ ఏప్రిల్17,ప్రభాతవార్త :** తాను ప్రేమించిన అమ్మాయి మరొకరితో తిరుగుతుందని అనుమానంతో ఆమెను దారుణంగా హత్య చేసిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వరుసకు మేనమామ అయిన విష్ణు అమ్మాయిని పలు సార్లు రాయితో తలపై మోదీ అతి దారుణంగా హత్య చేసిన కేసును పోలీసులు చాకిచాక్యంగా ఛేదించారు.సోమవారం శంషాబాద్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి నారాయణ రెడ్డి వివరాలు వెల్లడించారు.వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన ఓ కుటుంబం గత కొంతకాలంగా శంషాబాద్‌లోని మధురానగర్‌లో నివాసం ఉంటుంది అదే గ్రామానికి చెందిన అమ్మాయి మేనమామ శంషాబాద్‌లోని తొండుపల్లిలో అదెకు ఉంటూ కూలీగా పని చేస్తున్నాడు.మైనర్ బాలికతో విష్ణు గతంలో అనేక సార్లు శారీరకంగా కలిశాడు.దాదాపు నాలుగు నెలలుగా అమ్మాయి విష్ణుతో మాట్లాడకపోగా అతనితో దూరంగా ఉంటుంది.అమ్మాయి తరపులతో స్నేహంగా ఉంటూ తనని దూరం పెడుతున్నదని కక్ష పెంచుకున్న విష్ణు కథనం ప్రకారం ఈ నెల 11వ తేదిన ఆమెను రావాల్సిందిగా ఫోన్ చేశాడు.అతడి మాటలు నమ్మి వెళ్లిన ఆమెను నిర్మానుష ప్రదేశంలో బండరాయితో తలపై మోదీ హత్య చేశారు. ఆమెను హత మార్చిన తర్వాత ఏమీ తెలియనట్లు తన స్వగ్రాహానికి వెళ్లిపోయాడు.నాలుగు రోజుల తర్వాత శంషాబాద్ డిటిడిసి గోడౌన్స్ సమీపంలో మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి కేసు నమోదు చేశారు.సిసి పుటేజ్ ఆధారంగా వారి కదలికలను పసిగట్టి కేసును దర్యాప్తు చేయగా మైనర్ అమ్మాయిని విష్ణు హత మర్చినట్లు నిర్ధారణ అయింది.నిందితుడిని అదపులోకి తీసుకొని విచారించగా తానే హత మార్చినట్లు అంగీకరించారు.విలేకరుల సమావేశంలో శంషా బాద్ ఏసిపి భాస్కర్ గౌడ్,ఇన్స్‌పెక్టర్ ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.కేసును ఛేదించడంలో చురుకుగా వ్యవహరించిన ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్,ఎస్ఐ సుమన్,తదితర సిబ్బందిని డిసిపి నారాయణ రెడ్డి అభినందించారు.

**మైనర్ బాలికను హతమార్చిన దుర్మార్గులకు ఉరిశిక్ష విధించాలి**
మైనర్ బాలికను హతమార్చిన దుర్మార్గులకు ఉరిశిక్ష విధించాలని శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు.పాలెం గ్రామానికి చెందిన మృతురాలు కుటుంబ సభ్యులు బంధువులు శంషాబాద్ పోలీస్ స్టేషన్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.మైనర్ బాలికపై దాడి చేసి హతమార్చిన నరరూప రాక్షసులను ఉరితీయాలని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు.

## జిల్లాలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

-మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి -30మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అంచనా..?
-కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశం



.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి,పాల్గొన్న డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి,పాల్గొన్న జిల్లా సంబంధిత అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17, ప్రభాతవార్త**
రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 12 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, రైతుల నుంచి జిల్లా వ్యాప్తంగ సుమారు 30మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేయటానికి అంఛనా వేయటం జరిగిందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 2022-23రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశంను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా వరిధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రైతులకు ఇబ్బందులు కలుగకుండ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా వరిధాన్యం కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చె రైతుల కొరకు షామియానా, మంచినీరు, కుర్చీలను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని త్రాగునీరు, షామియానా, కుర్చీలు ఏర్పాటు చేయాలని, ధాన్యంకు సంబంధించిన వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ ఏరోజు కారోజు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరగకుండ ఎప్పటికపుడు అప్రమత్తంగ ఉండాలని, ఏవైనా సంఘటనలు సంబంధించి నట్టైతే వెంటనే పై అధికారుల దృష్టికి వెంటనే తీసుకరావాలన్నారు.

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపునకు లారీల కొరత ఏర్పడకుండా చూడాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్యాడిక్లినర్లు, తేమశాతం కొలుచు మిషన్‌లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మిల్లర్లు ఎఫ్‌క్యూ ప్రమాణాల విషయంలో ఇబ్బందులు సృష్టించరాదని, కేంద్రాల నుంచి వచ్చె ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, డిసిఓ శ్రీనివాస్, డిఎస్‌ఓ తనుజా, డిఎంసిఎస్ రాజేందర్, రైస్‌మిల్లర్స్ అసోసిషియేషన్ వివిధ శాఖల అధికారులు, లారీ అసోసిషియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాతా శిశు ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర వైద్య బృందం



మాతా శిశు ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర వైద్య బృందం

**తాండూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులోని మాతా శిశు ఆస్పత్రిని కేంద్ర వైద్య బృందం సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆద్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లక్షా, ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కేంద్ర వైద్య బృదం సభ్యులు డాక్టర్ మౌనిక రాణా, డాక్టర్ నివేధితలు తాండూరు పట్టణ శివారులోని మాతా శిశు ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో గర్భిణీలకు, చిన్నారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణీలకు సబంధించిన లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, డెలివరీ తరువాత బాలింతలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వారికి అందిస్తున్న సేవలు, వసతులపై ఆరా తీశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లక్ష్యముస్కాన్‌లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలు, చిన్నారులకు అందిస్తున్న సేవలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలకు అందిస్తున్న సేవలను లక్షా అని, చిన్న పిల్లలకు అందిస్తున్న సేవలను ముస్కాన్‌గా ప్రకటించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను, మాతా శిశు ఆసుపత్రులను సందర్శించడం జరుగుతుందని తెలిపారు. ఉత్తమ సేవలను అందిస్తున్న ఆసుపత్రులను గుర్తించి లక్షా ముస్కాన్‌కు ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. ఎంపికైన ఆసుపత్రులలో 5సంవత్సరాల వరకు కేంద్ర ప్రభు త్వం ఆద్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్దికి, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.

### కంటి వెలుగును ప్రారంభించిన సర్పంచ్ ధరణి శివశంకర్ రెడ్డి

**తలకొండపల్లి ఏప్రిల్17,ప్రభాతవార్త :** కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దరణి శివ శంకర్ రెడ్డి పేర్కొన్నారు.తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్‌పల్లి గ్రామంలో సోమవారం కంటి వెలుగును సర్పంచ్ ధరణి శివ శంకర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...కంటి వెలుగు పథకం గ్రామీణ ప్రజలకు చక్కటీ అవకాశమని రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా కంటి వెలుగును ప్రారంభించి గ్రామీణ ప్రజల ఆరోగ్యార్థం కంటి వెలుగు దోహదపడుతుందని అన్నారు.కంటి వెలుగులో ఉచిత చికిత్స చేసి కంటి అద్దాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లిఖార్జున ,హెచ్‌సిఒ రవి కుమార్,మల్లయ్య,ఆప్తామిక్ శివకుమార్,డిఈవో సరిత,ఏఎన్ఎం రేవతి,హెచ్ఎం శ్రీనివాసులు, రమేష్ రెడ్డి,శంకర్,రైతు సమన్య సమితి అధ్యక్షుడు సత్యనారాయణ,సెక్రటరీ రమేష్,వార్డుమెంబర్లు చెన్నయ్య, రాజు,ఆశావర్కర్లు,అంగన్‌వాడీ టీచర్,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

### వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: చైర్మన్



పోచారం మున్సిపల్ 1 వ వార్డులో జరిగిన వార్డు సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మున్సిపల్ వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కరానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్‌లో చైర్మన్ కొండల్ రెడ్డి వార్డు సమావేశాలకు శ్రీకారం చుట్టారు. వార్డు కమిటీ సమావేశాల్లో భాగంగా చైర్మన్ సోమవారం మున్సిపల్ పరిధిలోని 1 వ వార్డు ఇస్మాయిల్ ఖాన్‌గూడలో స్థానిక వార్డు కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బందితో కలిసి జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా చైర్మన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. దోమల నివారణకు కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. వార్డుల్లో రోడ్ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్ కురుమ అధ్యక్షతన జరిగిన వార్డు సమావేశంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ ఎ. సురేశ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంటు గొంగళ్ల బాలేశ్ కురుమ పాల్గొన్నారు.

### గ్రామ జనాభాకు అనుగుణంగా మిషన్ భగీరథ నీటి సరఫరా పెంచాలి : సర్పంచ్ కావేరి



అవుశాపూర్ పంచాయతీ కార్యాలయంలో తాగునీటి సమస్యపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న సర్పంచ్ ఏనుగు కావేరి.

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

గ్రామంలోని అన్ని వార్డుల్లోకి మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేయాలని గ్రామ సర్పంచ్ ఏనుగు కావేరి సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని అవుశాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్ వై. కావేరి అధ్యక్షతన తాగునీటి సమస్యలపై మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్బంగా గ్రామంలోని కేపాల్ కాలనీ, గోల్డెన్ వ్యాలీ కాలనీకి మిషన్ భగీరథ మంచినీటిని సరఫరా చేయాలని కోరారు. గ్రామంలో కొత్తగా ఇండ్లు నిర్మితమై కాలనీలు విస్తరిస్తున్నందున, పెరుగుతున్నా జనాభాకు కనుగుణంగా తాగునీటిని అందిచాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. వరంగల్ జాతీయ రహదారి గ్రామం గుండా ఉండటంతో గ్రామం నలువైపుల ప్రధానంగా జాతీయ రహదారిని అనుకుని కాలనీలు ఏర్పాటు అవుతుండటంతో తాగునీటి డిమాండ్ ఉందని అన్నారు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా తాగునీటి సరాఫరా చేయాలని అధికారులకు గ్రామ సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈఈ నర్సింహులు, డీఈఈ మహేందర్, ఏఈఈలు రాహుల్, హరిణి, పంచాయతీ కార్యదర్శి సునీత, స్థానిక నాయకులు ఏనుగు మశ్చేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### నగరానికి చేరుకున్న రాడిసన్ కలెక్షన్

శామీర్‌పేట ఏప్రిల్17,ప్రభాతవార్త : రాడిసన్ హోటల్ గ్రూప్ తన లగ్జరీ లైఫ్‌స్టైల్ బ్రాండ్,రాడిసన్ కలెక్షన్ హైదరాబాద్‌లో మొదటి హోటల్‌ను ప్రారంభించింది.అతిపెద్ద టెక్ హబ్‌లలో ఒకటిగా తన రాజరిక వారసత్వం చారిత్రాత్మక స్మారక చిహ్నాలు,ఐకానిక్ ఫుడ్ స్ట్రీట్‌లతో ప్రసిద్ది చెందాడంతో పాటు అతిథులను ఒకే విధంగా అనుభవాల సంపదను అందిస్తోంది.ఈ 300గదుల హోటల్ నగరంలోని వ్యాపార కేంద్రాలు,ఐటీ పార్కులు ప్రత్యేక ఆర్థిక మండలాలు (ఎస్‌ఈజెడ్‌లు) ఉన్నఫైనాన్స్ డిస్ట్రిక్ట్‌కు జిల్లాకు సమీపంలో ఉంది.ఈ హోటల్ 2026 రెండవ త్రైమాసికం నాటి నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించింది.

## ప్రజావాణిలో వచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు

-మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి
-అందిన 83 దరఖాస్తులు
-ప్రజావాణిలో సమస్యల వెల్లువ



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో శామీర్‌పేట పెద్ద చెరువులో నీరు కలుషితం అవుతుందని చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ వార్డుసభ్యులు డి.నవీన్, డి.శ్రీకాంత్‌గౌడ్‌లు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డికి వినతిపత్రం (ఫిర్యాదు) అందజేసిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

ప్రజావాణిలో వచ్చిన సమస్యలు పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగ వచ్చిన ప్రజల నుంచి 83ధరఖాస్తులు, వినతులు, ఫిర్యాదులు అందినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను జిల్లా అధికారులకు శాఖల వారీగ స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే స్పందించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ధరఖాస్తులను, వినతులను, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండ ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని సమస్యలను పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

.. గ్రామాల్లో సమస్యల వెల్లువ..

..శామీర్‌పేట పెద్ద చెరువు వల్ల ఎంతో మంది రైతులు, మత్సకారులు జీవనోపాధిని పొందుతున్నారని, అయితే ఈ చెరువుకు పై భాగాన ఉన్న మేడ్చల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మురికినీరు డ్రైనేజీల నుంచి నీరు వాగుల్లోకి వదలటం వల్ల ఆ మురికినీరు శామీర్‌పేట పెద్ద చెరువులోకి చేరి పెద్ద చెరువు నీరు కలుషితం అవుతుందని,దీంతో రైతాంగంకు, మత్సకారులకు ఇబ్బందికరంగ మారిందని, అరికట్టటానికి తగు చర్యలు తీసుకోవాలని శామీర్‌పేట గ్రామ వార్డు సభ్యులు డి.నవీన్, డి.శ్రీకాంత్‌గౌడ్‌లు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డికి వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి శామీర్‌పేట పెద్ద చెరువు నీరు కలుషితం కాకుండ తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కీసర మండలంలోని బోగారంలోని మురికి నీరు వ్యవసాయ భూముల్లోకి కాలువల ద్వారా చేరటం వల్ల వ్యవసాయ భూములలో పంటనష్టం జరుగుతున్నట్లు, వ్యవసాయ భూములు కూడ దెబ్బతింటున్నాయని, బోరు బావుల నీరు కలుషితం, వాయు కాలుష్యం కూడ ఏర్పడుతున్నట్లు ప్రజల ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉందని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆ గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్‌రెడ్డి ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. అదే విధంగ జిల్లాలోని మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామపంచాయతీల సిబ్బందికి పారిశుద్యకార్మికులు (పంచాయతీ వర్కర్స్)కు వేతనాలు అందక ఆర్థికంగ ఇబ్బందులు పడుతున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పలు గ్రామ పంచాయతీల్లో కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో 3నుంచి 5నెలల వరకు వేతనాలు అందని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి ఉన్నా గ్రామపంచాయతీల కార్మికులకు వేతనాలు సకాలంలో అందని పరిస్థితి ఉందని అన్నారు. పెరిగిన జీతం 30శా తం పిఆర్‌సి ఇవ్వాలని కోరారు. దీనిలో జిల్లా సిఐటియు కోశాధికారి ఉన్నికృష్ణన్, గ్రామపంచాయతీల యూనియన్ జిల్లా అధ్యక్షులు రవి, కార్మికులు, పాల్గొన్నారు.

## అన్ని మతాలకు సముచిత స్థానం ఇస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**కొందుర్గు, ఏప్రిల్ 17, (ప్రభాతవార్త) :** రాష్ట్రంలోని అన్ని మతాలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సోమవారం స్థానిక జీఎం పటేల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే ప్రభుత్వం నుంచి సరఫరా అయిన రంజాన్ కిట్‌లను మైనార్టీ మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వత ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనలో ఎన్నో సంక్షేమ, ఉపాధి, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి వాటిని విజయవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. దేశంలో ఎక్కడ లేని పథకాలు ఇక్కడ ప్రవేశపెటడంతో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్‌కు ఎలా సాధ్యమైందని ఆలోచన చేస్తున్నారని ఆయన అన్నారు. పక్క రాష్ట్రాలు అయిన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రాలలోని సమీప గ్రామాల ప్రజలు తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తులు చేస్తున్నారని అన్నారు. మంచి పరిపాలన దక్షత గల కేసీఆర్‌ను మళ్లీ మరోకసారి ఆశీర్వాదించేలా ప్రజలను చైతన్య పర్చాలని ఆయన నాయకులను, కార్యకర్తలను కోరారు. అంతకుముందు నేరుగా ఆయన మహిళల వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా...? ప్రభుత్వ పాలన తీరును అడిగి తెలుసుకున్నారు.

**బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి ....**

సోమవారం నాడు మండల పరిధిలోని ముట్పూరు కాంగ్రెస్ ఎంపీటీసీ రాంరెడ్డి,



మైనార్టీ మహిళలకు రంజాన్ కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే

కొందుర్గు మాజీ సర్పంచి వెంకటేశ్, హన్మంత్, శంకర్, బీజేపీ మండల గీతా సెల్ కన్వీనర్ చిన్నరాజుగౌడ్, తదితరులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, సర్పంచులు కావాలి ఆదిలక్ష్మీయాదయ్య, నర్సింహ్మారెడ్డి, బాల్‌రాజ్, సంధ్యారాణి, ఆంజనేయయులు, నాయకులు రామకృష్ణ, దర్గా రాంచందర్, రెడ్డి నర్సింలు, సీలం లింగం, బోజగారి శ్రీను, కిశోర్,, మచ్చేందర్‌రెడ్డి, చిప్ప చందు, ఎ.మాణయ్య, రాజు రమేష్‌రెడ్డి, ప్రభాకర్, సచిన్, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్‌గౌడ్, శంకర్, రశీద్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## జాతీయ కళామండిలి అధ్యక్షుడు అశోక్‌కు సన్మానం

**మేడ్చల్, ఏప్రిల్ 17. ప్రభాతవార్త ః** కళారత్న అవార్డును పొందిన జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్ వై అశోక్‌ను మేడ్చల్‌లో మేడ్చల్‌లో సన్మానం అందుకున్నాడు. అంబేద్కర్ జయంతి సందర్బంగా ఈ నెల 14న రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవంలో కళారత్న అవార్డును అందుకున్నందుకు గాను ఆయనను మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ భవణంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరుషరాం ఆధ్వర్యంలో సన్మానించారు. జాతి అభ్యున్నతి కోసం నిరంతరం కష్టపడుతూ, ఆటపాటలతో ఉత్సవాన్ని నింపుతూ నాయకులను, కార్యకర్తలను ముందుకు నడిపిన ఆయనను తెలంగాణ ప్రభుత్వం అవార్డును అందజేయడం సంతోషకరమని ఈ సందర్బంగా పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఎమ్మార్పీఎస్ నాయకులు బాలనర్సింహ, బాలకృష్ణ, శివకుమార్, రామకృష్ణ, సరేందర్, భాను, మహేష్, నాగరాజు, రాజు, రవి, సుధాకర్, మల్లేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు సొంత కాళ్లమీద నిలబడే విధంగా ఎదగాలి : ఎంపీపీ



డబిల్‌పూర్‌లో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

**మేడ్చల్, ఏప్రిల్ 17. ప్రభాతవార్త ః** మహిళలు స్వంత కాళ్లమీద నిలబడే విదంగా ఎదగాలని మేడ్చల్ ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి అన్నారు, మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో అభయ ఫౌండేషన్, గ్రామ సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి సహకారంతో మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డితో కలిసి ఎంపిపి వాటిని ప్రధానం చేశారు. ఆమె ఈ సందర్బంగా మాట్లాడుతూ ఇంటి పనితో పాటు మహిళలు ఆర్థిక స్వాలంబన కోసం అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబంతో పాటు దేశం పురోగతి సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్, గ్రామ మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, ఎంపిటిసి హేమలత, ఉప సర్పంచ్ సత్యనారాయణ, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ మాజీ ఎంపిటిసి సత్యనారాయణ, వార్డు సభ్యులు శ్రీనివాస్, రామోదర్‌రెడ్డి, హరి, సుజాత, స్వప్న. కో ఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు భాగ్యరెడ్డి, అశోక్, నారాయణ దాస్, శ్రీనివాస్, రాంచందర్, ప్రవీణ్, గంగారాం, శ్రీరాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం



**మొయినాబాద్, ఏప్రీల్ 17, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని మమత ఉన్నత పాఠశాల 2012, 13 వ సంవత్సర పూర్వవిద్యార్థులు ఆత్మీయసమేళనం ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలో ఆత్మీయసమ్మేళనంలో స్నేహితులంతా కలిసి ఒక్కరికోకరు ఆత్మీయంగా అళింగణం చేసుకోని పాతరోజులను నెమరువేసుకున్నారు, గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు వివాహలను చేసుకోని వారి పిల్లలతో కలిసి ఆత్మీయసమ్మేళనానికి రావడంతో గురువులు వారిని చూసి మురిసిపోయారు. అక్కడికి వచ్చిన 2012వ బ్యాచ్ విద్యార్థులంతా కలిసి విందు ఏర్పాటు చేసుకోని, ఆనందంగా గడిపారు, ఇలాంటి రోజులు మళ్ళీ జీవితంలో తిరిగిరావని ఒక్కరినోక్కరు బాగోగులు అడిగి తెలుసుకున్నారు, ఏ అవసరమోచ్చినా ఒక్కరినోక్కరు సహకరించుకోవాలని ఒక మనిషి జీవితంలో అన్నింటికంటే విలువైనది ఒక స్నేహితుడు మాత్రమే అని మంచిమిత్రుడు దోరకడం మానవజీవితంలో మొదటి గెలుపన్నారు, అనంతరం మమతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మోహన్ రెడ్డి, వ్యాయమ ఉపధ్యాయులు పి ధన్‌రాజ్, హిందీ ఉపాధ్యాఉలు జానయ్య, తెలుగు ఉపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, గణిత ఉపాధ్యాఉలు శ్రీకాంత్, మోహన్ తధితరులు పాల్గోని ఆనందంగా గడిపి విజయవంతంగా ఈ కార్యాక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యాక్రమంలో విద్యార్థులు తధితరులు పాల్గోన్నారు,

### అక్రమంగా భూమిని చదును చేసిన పత్తి రవికుమార్ అనుచరులు

**కడ్తాల్,ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** గత రెండు రోజుల క్రితం పత్తి రవికుమార్ అతని అనచరులు కలిసి సర్వేనంబర్ 260లో గల వ్యవసాయ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి కడిలు డామేజ్ చేసి భూమిని చదును చేశారు. పొలానికి సంబంధించిన వారు కోరుపోలు నరెందర్‌రెడ్డి సోమవారం వారి బంధువులతో వచ్చి చూసి సరైన డాక్యు మెంట్ తీసుకుని పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వగా ఎస్సై హరిశంకర్‌గౌడ్ కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

### చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: బిఎన్ఆర్ ట్రస్టు

**యాచారం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో హనుమాన్ దేవాలయం వద్ద బిఎన్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివే ంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు సభ్యులు తెలిపారు. బిఎన్ఆర్ ట్రస్టు చైర్మన్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా ప్రతి రోజు ఉదయం శరీరంలోని అధిక వేడిని తగ్గించి చలువ చేసి శరీర ధృడత్వానికి ప్రతి రోజు అంబలి అందజేస్తున్నామన్నారు. రాగి అంబలి ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చుతుందని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన బిఎన్ఆర్ ట్రస్టు చైర్మన్ శేఖర్‌రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్బంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముందు గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా అద్భుతమైన కార్యక్రమాలు చేపడతామన్నారు.

### రాష్ట్రంలో రెవెన్యూ న్యాయస్థానాలు ఏర్పడాలి

సుప్రీం కోర్టు న్యాయవాది నిరూప్‌రెడ్డి



తెలంగాణ భూమి కరవాన్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**యాచారం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో తెలంగాణ భూమి కరవాన్ ఆధ్వర్యంలో నల్సర్ యువర్ సిటీ ప్రొఫెసర్(భూ న్యాయ నిపుణులు) సునీల్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది నిరుప్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్రి నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో తెలంగాణ భూమి కరవాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2014 నుండి రైతులకు ధరణి శాపంగా మారిందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ధరణితో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వినోభాబావే ఆశయాల మేరకు ఆయన ఆశయసాధన కోసం భూప్ కార్వాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారకు. ఏప్రిల్ 18న భూదాన్ పోచంపల్లిలో భూ సమస్యలపై పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాలు పేదల భూముల సమస్యలపై స్పందించి వారికి న్యాయం చేసేలా కృషి చేయాలని కోరారు. ధరణి దండగ అని అందులో సంపన్నులకే న్యాయం జరుగుతుందని, పేదలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఉప్పల భాస్కర్, స్వచ్ఛంధ కార్యకర్తలు ఉన్నారు.

## కోరం లేక వాయిదాపడిన యాలాల మండల సర్వసభ్య సమావేశం

-సభ్యుల గైర్హాజరులో తెరవెనుక రాజకీయం?

**యాలాల ఏప్రిల్ 17,ప్రభాతవార్త :**

కోరం లేక పోవడంతో యాలాల మండల సర్వసభ్య సమావేశం వాయిదాపడింది.సోమవారం ఎంపిపి తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది.ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశానికి కేవలం ముగ్గురు ఎంపిటిసి సభ్యులు మాత్రమే హాజరయ్యారు.మిగితా ఎంపిటిసిలు వ్యక్తిగత కారణాల వల్ల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరయ్యారు.మధ్యాహ్నం ఒంటిగంట వరకు సభ్యుల కోసం వేచిచూసిన అధికారులు,ఇతరులు సభ్యులు గైర్హాజరవ్వడంతో 19 వ తేది బుదవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ పుష్పలీల ప్రకటించారు.కాగా సభ్యులు సమావేశానికి రాకపోవడం వెనుక అంతర్గత పోరు ఉన్నట్లు తెలిసింది.మండల సర్వభ్య పమావేశానికి సభ్యులు రాకుండా చేయడంలో ఓ మండల స్థాయి బిఆర్ఎస్ పార్టీనాయకుడు,మండల స్థాయి ప్రజాప్రతినిధి తెల వెనుక కుట్రలు చేశారనే ఆరోపణలు వ్యక్తం అయ్యాయి.ఏది ఏమైనా మండలంలో నాయకుల మద్య కొనసాగు తున్న అంతర్గత పోరుతో రానున్న ఎన్నికల్లో తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు.సర్వసభ్య సమావేశానికి సర్పంచులు,వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

### పోచారం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా కిరణ్‌కుమార్ నియామకం

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఉట్కూరి కిరణ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించినట్లు కమిషనర్ అర్ర సురేశ్ సోమవారం నాడొక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ తరపున జిల్లా, కిందిస్థాయి కోర్టుల్లో న్యాయపరమైన విధులను నిర్వహించేందుకు ప్రభుత్వం కిరణ్‌కుమార్‌ను మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించినట్లు తెలిపారు. కాగా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు కిరణ్‌కుమార్ మున్సిపల్ కార్యాలయానికి రాగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నర్సింహులు తదితరులున్నారు

### కంటి వెలుగును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి



మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వసువతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్

**కీసర,ఏప్రిల్17,ప్రభాతవార్తః**

కంటి వెలుగును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని విజయవంతం చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ గురువెల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమే ప్రారంభించారు.ఈ సందర్బంగా చైర్మన్ మాట్లాడుతూ ఇతర కంటి సమస్యల అన్ని సేవలు ఉచితంగా అందిస్తారన్నారు.అవసరమున్న వారికి మందులు ఇస్తారన్నారు. తీవ్రమైన కంటి వ్యాధుల నివారణపై పౌరులకు అవగాహన కల్పిస్తారన్నారు.పేద,మధ్య తరగతి ప్రజలకు కంటి పరీక్షలు 100 రోజుల పాటు నిర్వహించి మందులు,కంటి అద్దాలను అందజేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ స్వామి, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి,సానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రభు,డాక్టర్లు పాల్గొన్నారు.

### గుండెపోటుతో మృతి చెందిన ఎంపిడిఓకి శ్రద్ధాంజలి

**కీసర,ఏప్రిల్17,ప్రభాతవార్తః** కీసర మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న ఎంపిడిఓ రమాదేవి గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. నగరంలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న ఆమే తీవ్ర అస్వస్థతకు గురి కాగ కుటుంబ సభ్యులు నగరంలోని యశోదా ఆసుపత్రికి తరలించారు.కాగా అప్పటికే ఆమే మృతి చెందిందని వైద్యులు ధృవీకరించారు.ఆకస్మికంగా గుండెపోటుతో అకాల మరణం చెందిన ఎంపిడిఓకి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపి సత్తిరెడ్డి,ఎంపిఓ మంగతాయారు,ఎంపిటిసిలు నారాయణశర్మ, పండుగ కవిత,జూపల్లి వెంకటేష్,తహశీల్దార్ గౌరివత్సల,ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు ఆకిటి మహేందర్‌రెడ్డి,పెంటయ్య,పంచాయతీ కార్యదర్శులు సురేష్‌రెడ్డి,బిల్ కలెక్టర్‌లు ఆమే చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్దాంజలి ఘటించారు.

### సిసి రోడ్డు వేయాలని కౌన్సిలర్‌కి వినతి

**కీసర,ఏప్రిల్17,ప్రభాతవార్తః**

దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో మారుతినగర్ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని ఆ కాలనీ అధ్యక్షులు విగ్నేష్ ఆద్వర్యంలో సోమవారం కౌన్సిలర్ గురువెల్లి వెంకటరమణికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్బంగా కౌన్సిలర్ మాట్లాడుతూ త్వరలోనే జరుగబోయే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించి త్వరలోనే సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు.సీసీ రోడ్డు వేయమని అడగగానే సానుకూలంగా స్పందించిన కౌన్సిలర్ వెంకటరమణికి కాలనీవాసులు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు భాష,రవికుమార్,సుజాత,సరిత,పద్మ,రాణి,బాబి తదితరులు పాల్గొన్నారు.

### హరితహారం చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



గోదుమకుంట గ్రామంలో హరితహారం కింద నాటిన చెట్లను నరికిన అక్రమార్కులు

**కీసర,ఏప్రిల్17,ప్రభాతవార్తః**

మండలంలోని గోదుమకుంట గ్రామంలో హరితహారం కింద నాటిన చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్బంగా గ్రామస్తులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని హరితవనంగా మార్చి,కాలుష్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం లక్ష్యం కొందరు అక్రమార్కుల కారణంగా నీరుగారుతుందన్నారు.గోదుమకుంట గ్రామ పంచయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో గతంలో పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 2లో లే అవుట్ చేసిన రియల్టర్లు రోడ్డు ప్రక్కన గ్రామ పంచాయతీ ఆద్వర్యంలో హరితహారంలో భాగంగా నాటిన సుమారు 10 చెట్లను నిర్దాక్షిణంగా నరికివేశారన్నారు.ఈ విషయమై తగిన విచారణ జరిపి హరితహారం చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కర్యదర్శిని కోరారు.

### నూతన్‌కల్ గ్రామంలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కప్‌ను అందజేస్తున్న నేతలు

**మేడ్చల్, ఏప్రిల్ 17. ప్రభాతవార్త ః** మేడ్చల్ మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో ఉషిగారి గిరిబాబు ఆద్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. టోర్నమెంట్ విజేతలకు మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్, డబిల్‌పూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నేత రాజమల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డిలు టోర్నమెంట్ కప్‌ను అందజేశారు. యువత క్రీడల్లో పాల్గొని మాసనిక ఉల్లాసం పొంది, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పలువురు సూచించారు. అదే విదంగా నచ్చిన క్రీడల్లో రాణించి ప్రావీణ్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, వెంకటేష్, యూనుస్ పాష, క్రీడా కారులు పాల్గొన్నారు.

### ఆడబిడ్డ పెండ్లికి పుస్తెలు,మెట్టెలు అందజేత

**మేడ్చల్, ఏప్రిల్ 17. ప్రభాతవార్త ః**

మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి పద్మా జగన్‌రెడ్డి ఆడబిడ్డ పెండ్లికి పుస్తెమట్టెలు అందజేశారు. గ్రామానికి చెందిన ఆశా, గిరిధర్ గౌడ్ దంపతుల కూతురు మౌనిక పెండ్లికి మాజీ ఎంపిపి సోమవారం తన నివాసంలో తల్లిదండ్రులకు పుస్తె మట్టెలతో పాటు నూతన వస్త్రాలను ప్రధానం చేశారు. తన వంతు సహకారంగా సీఎం కేసీఆర్ స్పూర్తితో ఈ సహకారం చేస్తున్నానని ఈ సందర్బంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి పాల్గొన్నారు.



పుస్తె మట్టెలను అంజేస్తున్న మాజీ ఎంపిపి పద్మాజగన్‌రెడ్డి

## కొత్త బంగారు లోకం చూపుతున్న కంటి వెలుగు

**-కంటి వెలుగు ప్రారంభోత్సవంలో జడ్పివైస్ చైర్మన్ గణేష్**



మామిడిపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పివైస్ చైర్మన్,ఎంపిపి ,తదితరులు

**నందిగామ ఏప్రిల్17,ప్రభాతవార్త :** కంటి శుక్లాల లోపమున్న ప్రతి ఒక్కరికి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కొత్త బంగారు లోకాన్ని చూపుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఏ పార్టీ సాటిరాదని జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,ఎంపిపి ఎం.ప్రియాంక శివ శంకర్ గౌడ్లు అన్నారు.సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలు కార్యక్రమాన్ని నందిగామ మండలం మామిడి పల్లి గ్రామంలో ప్రారంభించారు.సర్పంచ్ గడ్డం కవితా శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ....ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సిఎం కెసిఆర్ ప్రభుత్వం ప్రగతికి బాటలు వేస్తు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమాన్ని గ్రామీణ నిరుపేదలు సద్వినియోగం చేసుకొని తమ జీవితాలను వెలిగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కాట్న మాధవి రవిందర్,ఉప సర్పంచ్ హన్మంత్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ,కాట్న శ్రీశైలం,గడ్డం శ్రీనివాస్,నర్సింలు, బిఆర్ఎస్ నాయకులు ,నందిగామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది,ఆశవర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించిన జడ్పిటీసి

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 17,(ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ అంగన్‌వాడి కేంద్రాన్ని సోమవారం జడ్పిటీసి బంగారు స్వరూపరాములు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కేంద్రంలోని చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిభందనల ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించకుండ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

## సిసి రోడ్డు పనులకు నిధులు మంజూరు



ప్రొసిడింగ్ కాపిని అందజేస్తున్న జడ్పిటిసి వెంకటేష్

**తలకొండపల్లి ఏప్రిల్17,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండలం బల్సులపల్లి తండా గ్రామపంచాయతీలో నుండి సేవాలాల్ గుడి వరకు సిసి రోడ్డు కోసం జిల్లా పరిషత్ నిధుల నుండి 5లక్షల రూపాయలు ప్రొసిడింగ్ కాపిని దేవాలయ కమిటీ చైర్మన్ దాసు నాయక్‌కి అందజేశారు.ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్,రవి నాయక్, రాథోడ్,యూత్ కోశాధికారి బాలకృష్ణ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



**తలకొండపల్లి ఏప్రిల్17,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మరియు కామినేని వారి సౌజన్యంతో జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు.గ్రామంలోని ప్రజలు 286 మందికి బిపి,షుగర్ టెస్టులు చేసి ఉచిత మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్,సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు,శ్రీనివాస చారి,యాదయ్య,కృష్ణలు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.అనంతరం డాక్టర్లు అందించిన సేవలకు ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్, సర్పంచ్ శ్యాం సుందర్ రెడ్డి,ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి,మాజీ సర్పంచులు శ్రీనువాస చారి,యాదయ్య,నాయకులు రాజేందర్ రెడ్డి,కృష్ణ,మనోహర్ ,కృష్ణ, మహేష్,సంపత్,నరసింహ్మా,జానయ్య కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతో వ్యాధుల నివారణ



ధ్యానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ధ్యానప్రచార కార్యదర్శి

**షాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**
ప్రతిరోజు శ్వాస మీద ద్యాస పెట్టి ధ్యానం చేసి ఎలాంటి వ్యాధులైన నివారించుకోవచ్చని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటి ధ్యానప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయులురెడ్డి, సంగు వెంకటేశ్వర్లు తెలిపారు. గుండె, కిడ్నీ, షూగర్, బిపి లాంటి వ్యాధులు ధ్యానం ద్వారా తగ్గుతాయన్నారు. సోమవారం మండలంని మద్దూర్, చిన్నసోలిపేట, పెద్దసోలిపేట, పెద్దవీడు, హైతాబాద్ గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. శారీరకమైన మానసికపరమైన అనేక లాభాలు ధ్యానం ద్వారా పొందుతామన్నారు. నిత్యజీవితంలో ఎన్నో సమస్యలతో సతమతమయ్యే వారికి ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమ పిల్లలను చిన్నప్పటి నుంచే ధ్యానం చేయించడం అలవాటు చేయించాలని రోగ నిరోధక శక్తి వారిలో పెరిగి భవిష్యత్తులో వ్యాధులు రాకుండా ఉండగలుగుతారన్నారు. ఈకార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు శ్రీనివాస్, వెంకటలక్ష్మి, గుండం శైలజ, రాధ, సుభద్ర, ఎన్.స్వప్న, బి.స్వప్న, కృష్ణమద్దిలేటి యాదయ్య, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



చేవెళ్ల మండల కేంద్రంలోని కెజిఆర్ గార్డెన్‌లో రంజాన్ మాసంను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులకు తినిపిస్తున్న చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, సీనియర్‌నాయకులు నున్నపు వసంతం, ఆగిరెడ్డిలు తదితరులు (చేవెళ్ల – ప్రభాతవార్త)

## పాఠశాల నిర్మాణానికి దాతల కృషి అభినందనీయం : ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**-ఇంద్రానగర్ జడ్పి పాఠశాల తరగతి గదుల ప్రారంభం**
**న-కళ్యాణ లక్ష్మీ రంజాన్ కానుకల పంపిణీ**

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 17,(ప్రభాతవార్త):**
విద్యాదానం ఎంతో గొప్పది.. విద్యాభివృద్ధికై ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఇంద్రానగర్‌లో రూ.42.40లక్షలతో దాతలు తరగతి గదులు నిర్మించడం ఎంతో అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని ఇంద్రానగర్‌లో జడ్పి పాఠశాల తరగతి గదులను స్థానిక సర్పంచ్ మహబూబీతో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలానికి బీసి గురుకుల మంజూరు చేసిన వెంటనే దాత ఎమ్‌డి అక్రమ్, నాగరాజు, గ్రామస్తుల సహకారంతో అన్ని వసతులు కల్పించారని, పాఠశాలకు అదనపు గదులు ఏర్పాటు చేశారని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ విద్యాభివృద్ధి కోసం ఎన్నో రకాలుగా నిధులు కేటాయిస్తు వస్తున్నారని అన్నారు. గతంలో ఎప్పుడు లేని విదంగా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి ఉచితంగా విద్య, బోజన, వసతులను కల్పించారని తెలిపారు. తెలంగాణలో గురుకులాకు ఇస్తున్న ప్రాధాన్యత దేశంలో మరి ఏ రాష్ట్రంలో లేదని అన్నారు. అనంతరం దాతలను ఎమ్మెల్యే సన్మాణించారు.

**కళ్యాణ లక్ష్మి చక్కటి పథకం....**
పేదింటి ఆడబిడ్డా కష్టాన్ని తీర్చే విదంగా కళ్యాణ లక్ష్మీ ఓ వరంలా ఉందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 29మందికి చెక్కులను అందజేశారు. ఆడబిడ్డలకు కేసీఆర్ అందజేస్తున్న పెళ్లి కానుకలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి పథకం తీసుకురాలేదని ఆయన గుర్తు చేశారు.

**రంజాన్ కానుకల పంపిణీ**



అదనపు గదుల శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణ ప్రభుత్వం ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా మంజురు చేసిన తోఫాలను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఇంద్రానగర్ లో పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హిందు, ముస్లిం, క్రైస్తవుల ప్రత్యేకమైన పండుగలకు కానుకలు అందజేస్తున్నారని అన్నారు. అన్ని గ్రామాల్లో పంపిణీ పూర్తి కావస్తుందని సంతోషాల మద్య రంజాన్ వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. అదే విదంగా ఎమ్మెల్యే రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిపక్షాల రాదాంతాలు, భహిరంగ విమర్శలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయ్‌కుమార్, ఎంపిడిఓ మహేష్‌బాబు, జడ్పిటీసి బంగారు స్వరూప, పిఏసిఎస్ చైర్మన్ ధామోదర్‌రెడ్డి, డైరెక్టర్ జబ్బార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, దాతలు నాగరాజు, అక్రమ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బాబురావు, బాల్‌రాజు, ఎంపిటిసి మంగమ్మ, కో ఆప్షన్ సభ్యుడు నర్సింగరావు, నాయకులు పడకంటి వెంకటేష్, రాములు, కొండి యాదయ్య, మాణెయ్య, చంద్రశేఖర్, సలీం, జబ్బార్, లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఎక్కడ నిర్మించారు?

**-పిసిసి ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్**



బీఆర్ఎస్ వైఫల్యాలను వివరిస్తున్న కాంగ్రెస్ నేతలు

**శంషాబాద్ ఏప్రిల్17,ప్రభాతవార్త :**
పేద ప్రజలకు నిర్మించి ఇస్తామన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎక్కడ నిర్మించారో చూపించాలని పిసిసి ప్రధాన కార్యదర్శి బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అధికార పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో సుల్తాన్ పల్లి,చౌదర్‌గూడ,కవ్వగూడ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ఏ గ్రామానికి వెళ్లిన డబుల్ బెడ్ రూమ్‌ల జాడ కనిపించడం లేదని ప్రభుత్వం పేద ప్రజలకు ఆశచూపించి నిలువునా ముంచిందని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆరోపించారు.దళితులకు ఇస్తామున్న మూడెకరాల భూమి ఇంతవరకు ఇవ్వలేదని ప్రతి దళితుడికి దళితబంధు పథకం కింద పది లక్షల రూపాయలు ఇస్తామని ఆశ చూపి అడియాశలు చేశారని ఆరోపించారు.ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని ఎన్నికల ముందు చెప్పిన బీఆర్ఎస్ పార్టీ వాటిని పూర్తిగా మార్చిపోయి కొత్త ఆశలను చూపుతున్నారని ఆరోపించారు.రెండుసార్లు అవకాశం కల్పించిన ప్రజలు ఈసారి బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని అన్నారు.ప్రతి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించాలని శేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు.ఏ ఒక్క గ్రామంలో కూడా డబుల్ బెడ్ రూమ్ నిర్మించలేదని నిర్మిస్తే ఆ పార్టీ నాయకులు చూపించాలని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నరేందర్ పార్టీ నాయకులు సులోచన శ్రీను,సంజయ్,మహేందర్,రమేష్ యాదయ్య,బొబ్బిలి శేఖర్ ,రమేష్, సప్తగిరి,ఉమామహేశ్వర్,ధనుంజయ్,కాలేజ్ ప్రవీణ్,దేవేందర్, లక్ష్మయ్య, రఘు, శ్రీనాథ్,తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సిఎంఆర్ఎఫ్ వరం: రాజునాయక్



సిఎంఆర్ఎఫ్ చెకు క్కలను పంపిణీ చేస్తున్న రాజునాయక్

**యాచారం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**
నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం వరమని నందివనపర్తి మాజీ సర్పంచ్ రాజునాయక్ అన్నారు. మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా లబ్ధిదారులకు సోమవారం ఆయన పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కందికంటి నర్సింహకు రూ. 13, 500, సామ అమృతకు రూ. 54 వేలు, వర్కవత్ లోకేష్‌కు రూ. 34 వేలు మంజూరైనట్లు వివరించారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ పేదరి కంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమి త్తం ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందన్నా రు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో ఉపసర్పంచ్ మూడేడ్ల గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు గడ్డం దయాకర్, కొండూరి రామనాథం, కొండాపురం శ్రీశైలం, గణేష్‌నాయక్, షాహిద్, నెర్ర శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు రూ. 600 వేతనం ఇవ్వాలి: అంజయ్య



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

**యాచారం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి. అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని మాల్ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి పేదలపై భారం మోపిందన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు వేతనాలు సక్రమంగా అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పథక చట్టం ప్రకారం వారానికొకసారి పే స్లిప్‌లు ఇవ్వాలని, పనులు ప్రారంభమై 17 రోజులు గడుస్తున్నా నేటికీ పే స్లిప్‌లు అందించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో అనేక మార్పులు చేసి కూలీలకు ఉపాధిని దూరం చేస్తుందని ఆరోపించారు. కూలీలకు కనీస మౌళిక సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వాలు కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. పని ప్రదేశంలో కూలీలకు టెంట్లు, మంచి నీరు సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు ఇందిరమ్మ, సత్తయ్య, గిరి, జహ ంగీర్, యాదయ్య, జంగయ్య, నర్సింహ, సత్తయ్య, లక్ష్మమ్మ, జంగమ్మ, శ్రీలత, రాధిక, రాజేశ్వరి, యాదమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో సిపిఆర్‌పై అవగాహన

**యాచారం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి సిపిఆర్‌పై డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్ నాగయ్యలు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు అంబులెన్స్ వచ్చే లోపు ప్రాణం కాపాడడంలో సిపిఆర్ ఎంతో కీలకమన్నారు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో డెంటల్ అసిస్టెంట్ సర్జన్ లలితాదేవి, ఆయుష్ వైద్యురాలు ఉమారాణి, సిబ్బంది ఎఎన్ఎం, ఆశాలు, డీఈవో ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



సిపిఆర్‌పై శిక్షణ కల్పిస్తున్న వైద్యాధికారులు

## అన్ని వర్గాల ఆశ జ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

**- వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం**



విరాళం చెక్కును అందజేస్తున్న ఎం.డి.ఇబ్రహీం

**షాద్‌నగర్, ఏప్రిల్ 17, (ప్రభాతవార్త) :** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్ని వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించారని, నేడు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుతంగా జీవిస్తున్నారు అంటే అది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందని వైఎస్సార్ టీపీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం పరిధి చౌదరిగూడ మండలంలోని బురెడ్డి పల్లి గ్రామంలో ఈ నెల 26న ఏర్పాటు చేయనున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఎం.డి ఇబ్రహీం రూ.11 వేలు విరాళం ప్రకటించారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీలో ఉన్న వైఎస్సార్ టీపీ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం తన వంతు సహాయంగా విరాళం చెక్కును నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ... బురెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఆ మహానుభావుడు అంబేద్కర్ విగ్రహానికి తన వంతు సహాయం అందజేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. అనంతరం బేడ బుడగ జంగాల తరపున ఎం.డి. ఇబ్రహీంకు పలువురు నాయకులు, గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ పార్టీ నాయకులు, బేడ బుడగ జంగాల నాయకులు,, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారం మానుకోవాలి

**-మండల బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**శంషాబాద్ ఏప్రిల్17,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని లేదంటే తగ్గిన బుద్ధి చెప్తామని మల్కారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్చరించారు.సోమవారం మల్కారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల బిఆర్ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు నందిగామ రాజశేఖర్ గౌడ్,మండల రైతు విభాగం అధ్యక్షుడు కొత్త యాదగిరి రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేవంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకుల వైఖరిపై త్రీవంగా ధ్వజమెత్తారు.కాంగ్రెస్ పార్టీ దళితులకు గత 70 సంవత్సరాలుగా ఓటు బ్యాంకుగా మార్చుకొని వారికి తీవ్ర అన్యాయం చేసిందని వారి జీవితాల్లో ఎదుగుదల లేకుండా చేస్తుందని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో దళితుల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని వివరించారు.దళితుల సంక్షేమ కోసం ప్రవేశపెట్టిన పథకాలు కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.ముఖ్యంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రతి దళిత కుటుంబానికి న్యాయం జరిగేలా అమలు చేస్తున్నారని రాజశేఖర్ గౌడ్ యాదగిరి రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ నాయకులు కేవలం ఎన్నికల ముందు వచ్చి ఇతర పార్టీలపై బురద జల్లితే సహించేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ లలిత జంగయ్య,గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ వెంకటేష్ చారి,పంచాయతీ సభ్యులు కృష్ణ, లక్ష్మణ్,స్థానిక నాయకులు నీరటి రాజు,ఇటికేపల్లి శ్రీశైలం ,మహమ్మద్ అశోక్ శేఖర్ ,నవీన్,శ్రీకాంత్,వెంకట్ రెడ్డి,వీరేష్,సాయి ,కిషోర్ రెడ్డి,పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి బిఎన్ఆర్ ట్రస్టు చేయూత

**యాచారం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఆపదలో ఉన్న కుటుంబానికి బిఎన్ఆర్ ట్రస్టు చేయూతనందించి అండగా నిలిచింది. గ్రామానికి చెందిన పెరుమాండ్ల వెంకటస్వామి అక్క లక్ష్మమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని బిఎన్ఆర్ ట్రస్టు నుండి సోమవారం భాదిత కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొంగల్ల జోగిరెడ్డి, మండల కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ కం బాలపల్లి మల్‌రెడ్డి, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పంది సుధాకర్, వార్డు సభ్యులు బండి ఉమారాణి అలెగ్జాండర్, తెల్లమళ్ల అనిత రవి, మేకం శంకర్, ముచ్చర్ల వెంకటరమణ గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 17,(ప్రభాతవార్త):**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సురక్ష, జనశ్రీ భీమా పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ మహేష్‌బాబు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి యాదమ్మ అధ్యక్షతన భీమా పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు జనశ్రీ భీమా పథకం ద్వార సంవత్సరానికి రూ. 436 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఈ భీమా పథకం సాదరణ, ప్రమాద మరణాలు జరిగితే రెండు లక్షల ఇన్సురెన్సు వస్తుందని తెలిపారు. అలాగె సురక్ష బీమా పథకం ద్వార సంవత్సరాని రూ.20 చెల్లిస్తే ప్రమాద మరణానికి రెండు లక్షల ఇస్సురెన్సు వస్తుందని ఆయన తెలిపారు. జనశ్రీ భీమా పథకంకు 18సంవత్సరాల నుంచి 50సంవత్సరాల వారు అర్హులని, సురక్ష భీమా పథకానికి 18సంవత్సరాల నుంచి 70సంవత్సరాల వారు అర్హులని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రామస్వామి, ఎపిఓ ప్రవల్లిక, ఎంపిఓ విజయ్ కుమార్‌పాల్, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బూత్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యుడికి నియామకపు పత్రాన్ని అందజేస్తున్న కుర్మయ్య

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 17,(ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో బిజెపి బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా ముష్టి గారి నర్సింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజెపి మండల అధ్యక్షుడు కుర్మయ్య తెలిపారు. నూతన కమిటీ నాయకులు పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు హరీష్, అంజయ్య, నరేష్ పాల్గొన్నారు.

## ఆడపడుచులను అన్నల ఆదుకుంటున్న సిఎం కెసిఆర్



లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**
రాష్ట్ర ఆడపడుచులను సీఎం కేసీఆర్ ఓ తండ్రిలా, ఒక అన్నలా ఆదుకుంటున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో 22మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు, 40మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు, 19మంది లబ్దిదారులకు షాదీముబారక్ చెక్కులను అందించారు. అలాగే ముస్లిం మైనార్టీ ఆడపడుచులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ కానుకలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేశంలోని తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాలు అందించడంలో ముందు వరుసలో ఉందన్నారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో సీఎం అందిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ చేకుర్త గోవిందమ్మగోపాల్‌రెడ్డి,శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ మారేపల్లి పాపారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మెన్ భానూరు వెంకట్‌రాంరెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావలి గోపాల్, తహసీల్దార్ నయిముద్దీన్, ఎంపీడీవో వెంకయ్య, మున్సిపల్ కౌన్సిలర్ గండేటి శ్రీనాథ్‌గౌడ్, చంద్రమౌళి, ఆశోక్, మాజీ ఉపసర్పంచ్ సాతా ప్రవీణ్‌కుమార్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

## హీరో ప్రభాస్ ఫ్యాన్స్ ఆత్మీయ సమ్మేళనం



హీరో ప్రభాష్ పర్సనల్ మేనేజర్ రామకృష్ణను సన్మానిస్తున్న ఆమనగల్లు ప్రభాష్ ఫ్యాన్స్ అసోషియేషన్ సభ్యులు

**ఆమనగల్లు, ఏప్రిల్17, ప్రభాతవార్త:**
పాన్ ఇండియా స్టార్, టాలీవుడ్ యంగ్ రెబల్‌స్టార్ ప్రభాష్ ఫ్యాన్స్ సోమవారం ఆమనగల్లు పట్టణంలో సందడి చేశారు. ఆత్మీయ సమ్మేళనం పేరిట పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆమనగల్లు ప్రభాష్ ఫ్యాన్స్ అసోషియేషన్ అధ్యక్షులు మహేశ్, గౌరవ అధ్యక్షులు దుద్దు కృష్ణయాదవ్‌ల ఆధ్వర్యంలో సమావేశం కాగా ప్రభాష్ పర్సనల్ మేనేజర్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరైనారు. ప్రభాష్ ఫ్యాన్స్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రామకృష్ణను పూలమాలలు, శాలువాలతో సత్కరించి గౌరవించారు. ఈమేరకు రామకృష్ణ మాట్లాడుతూ వచ్చేనెలలో హైదరాబాద్‌లో ప్రభాష్ ఫ్యాన్స్ ఆత్మీయ సమ్మేళనం, ఫోటోషూట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సమావేశానికి పాన్ ఇండియా స్టార్ ప్రభాష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆమనగల్లు ప్రభాష్ ఫ్యాన్స్ అసోషియేషన్ ప్రతినిధులు అఫీజ్, శివ, ప్రవీణ్, ఇస్మాయిల్, మహేశ్, రూప్‌సింగ్, మురళి, శేఖర్ ఉన్నారు.

## విఓఏల సమస్యలను పరిష్కరించాలి

**మాడ్గుల,ఏప్రిల్17,ప్రభాతవార్త:-** మండలంలో ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న విఓఏల సయప్యలను పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షులు కట్ట ఈశ్వర్ అన్నారు.సోమవారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.అనంతరం ఎంపిడిఓ,రాఘవు,ఎపియం నర్సిహ్మాలకు తమ డిమాండ్‌లతో కూడిన నిరవధిక సమ్మె నోటిసును అందజేశారు.ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ విఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి,ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.కనీస వేతనం 26వేలకు పెంచాలన్నారు.గ్రామ సంఘం గ్రేడింగ్ లేకుండా ప్రతి నెల వేతనాలు విఓఏల వ్యక్తిగత ఖాతనోనే వేతనం చెలించాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విఓఏలందరూ పారిశ్రామిక విదానల చటం1947 సెక్షన్22 సబ్ సెక్షన్1 అనుసరించి సోమవారం నుండి సమ్మెకు చేస్తున్నట్లు వారు తెలిపారు.సమ్మెకు పోలీసుల అనుమతి కోరుతూ ఎస్ఐ ఉపేందర్‌కు వినతి పత్రం అందజేశారు.ఈకార్యక్రమంలో విఓఏలు చిక్కుడు వెంకటమ్మ ,సిర్సవాడ స్వప్న,గంజీ యాదగిరి,రజీయా, అంజలీ,పుష్ప, రాధిక, జయమ్మ,అసుష,లింగయ్య,సుమతి,ఉమదేవి,రేణుక,శశికళ,శోభ,రజీత,పాపయ్య,విజయ తదితరులు పాల్గోన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న విఓఏలు

## ప్రజావాణిలో భూ సమస్యల పరిష్కారం

### -తహసీల్దార్ భూవనేశ్వర్



ఫిర్యాదులను పరిశీలిస్తున్న తహసీల్దార్ భువనేశ్వర్

**ధారూర్ ఏప్రిల్17,ప్రభాతవార్త :** తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహిచంఇన ప్రజావాణిలో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజల నుంచి ధరణికి సంబంధించిన భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ భువనేశ్వర్ తెలిపారు.

## మార్వడి యువమంచ్ ఆధ్వరంలో ఉచిత మజ్జిగ పంపిణీ



**తాండూరు టౌన్ ఏప్రిల్17,ప్రభాతవార్త :**

ప్రతి సంవత్సరం మార్వడి యువ మంచ్ ఆధ్వర్యంలో వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉచిత మజ్జీగ వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు.సోమవారం తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని రాజస్థాని మహిళ మండలి అధ్యక్షురాలు సంతోష్ సంపత్ కుమార్, కార్యదర్శి కిషోరి భగ్‌ంచ్ దాస్,గగ్‌రానిలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....తమ సమాజ పెద్దల ఆర్థిక సహకారంతో మజ్జిగ కేంద్రాన్ని నడుపుతున్నామని రోజు సమాజ సభ్యులతో పాటు మంచ్ సభ్యులు కూడా పాల్గొంటారని తెలిపారు.పేద ప్రజలను దృష్టి పెట్టుకొని వేసవిలో మజ్జిగ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్ మోహన్, మంచ్ అధ్యక్షుడు బిజ్ మోహన్ బుబు, మంచ్ మాజీ అధ్యక్షుడు రమేష్ చంద్రచోటి,ఓం ప్రకాష్,సోమాని,రామామజ్ దాస్ సోని,సంపత్ కుమార్,భగ్‌వాన్ దాస్ ,మంచ్ కార్యదర్శి అరున్ సారదా,కోశాధికారి కిషన్,సభ్యులు మన్ మోహన్ బుబ్,కరన్ జైన్,అనిల్ సారదా,అశిష్ సారదా,క్రిష్టా ఊబ్,శ్రీజీపాలీ,సువిల్ సారదా తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



**చౌడపూర్ ఏప్రిల్17,ప్రభాతవార్త :**

మండల పరిధిలోగల మందిపల్ గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సర్పంచ్ మఠం ప్రమీల చంద్రశేఖర్,తమ వంతుగా 51వేల రూపాయలను విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ నిర్మాణంలో గ్రామస్తులు తమవంతు సహాయాన్ని అందించాలని సర్పంచ్ కోరారు.కార్యక్రమంలో మఠం రాజశేఖర్, చందు,శ్రీను,నన్నాజీ,పుల్లప్ప,జంగయ్య,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలకు ఆర్థిక సాయం

**చౌడపూర్ ఏప్రిల్17,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని కన్మన్ కల్వ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు చాకలి సత్తయ్య,బషమొని నర్సమ్మ మరణించారు. మాజీ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అందుబాటులో లేకున్నా స్థానిక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులచే బాధిత కుటుంబ సభ్యులకు 5వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి,ఎంపిటిసి రాములు,గ్రామ కమిటీ అధ్యక్షుడు ఖద్దర్,రామకృష్ణ,ఆంజనేయులు,విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింలు,అజమ్ పాషా,పాల్గొన్నారు.

## జిల్లాలో రెండవ విడత గొర్రెల పంపిణీపై కార్యక్రమం

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహించాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై వికారాబాద్ జిల్లాలో గ్రామాల వారీగా అవగాహన సదస్సులు ఈ నెల 15 నుండి 21 వరకు నిర్వహించడం జరుగుతున్నదని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.సదస్సులో పాల్గొంటున్న గొర్రెల పెంపకదారులకు గొర్రెల కొనుగోలుపై,చెల్లించాల్సిన లబ్ధిదారుని వాటా,చెల్లించాల్సిన విధానం మొదలగు విషయములపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ లక్ష్మినారాయణ

**కోట్‌పల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త;**

కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో సోమవారం నాడు జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకంలో భాగంగా పని చేస్తున్న కూలీలను పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పని చేస్తున్న కూలీలను వారి అటెండెన్స్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. గ్రామంలో ఫార్మేషన్ రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. ఒక కూలీ గాను రూ.272. కూలీలకు అందజేయడంజరుగుతుందన్నారు.ఇట్టి రూపాయాలు మేజర్‌మెంట్ ప్రకారంమే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉపాధి హామి పనుల్లో కూలీల సంఖ్య పెంచెందుకు సిబ్బందికి చర్యలు చేపట్టాలన్నారు,గ్రామాల్లో వన నర్సరీల నిర్వహణలలో మెలకువలు పాటించి వర్షాకాలం నాటికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం కూలీలకు తగిన సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ ఏలీష,ఉపాధిహామి టెక్నికల్ అసిస్టెంట్ హరిప్రసాద్, ఉప సర్పంచు శ్రీనివాస్, ఫిల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



ఎన్కెపల్లి గ్రామంలో ఉపాధిహామి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మినారాయణ

# దామరిగిద్ద గ్రామస్తులకు అదనంగా వైకుంఠదామానికి స్థలం

**చేవెళ్ల, ఏపిల్ 17, ప్రభాతవార్త :**

ఒకే గ్రామం..ఒకే వైకుంఠధామం నిరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం అనే కథనం ఈ నెల 5వ తేదిన వార్త దినపత్రిలో ప్రచురణకు అధికారులు స్పందించారు. వైకుంఠదామాల లక్ష్యం, గ్రామంలో ఏన్ని వైకుంఠదామాలు ఉండాలని వార్త దినపత్రిలో సవివరంగా ప్రచురించడం జరిగింది. పాలకుల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ ఆశయం నీరుగారుతుందని శిర్షిక రూపంలో ప్రచురించడం జరిగింది. అదికారులు పూర్తి స్తాయిలో విచారణ చేపట్టి దామరిగిద్దలో వివాదంను సద్దుమణిగించేలా చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకున్నారు. గత నెల రోజులుగా దామరిగిద్ద గ్రామంలో స్మశాన వాటిక స్దలంలో ఇరు వర్గాల ప్రజలు గోడవపడుతున్న సంగతి తెలిసిందే. దామరిగిద్ద గ్రామంలో స్మశానవాటికు ప్రభుత్వం స్దలం మంజురు చేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన స్దలం సరిపోదని, ఊరికి దగ్గర ఏళ్ల తరబడి పెడుతున్న స్మశానవాటికలోనే శవాలను ఖననం చేస్తున్నారు. ఇండ్ల మద్యలో స్మశానం వద్దని ఊరికి దూరంగా వైకుంఠ దామంను ప్రభ్వుంమంజూరు చేసిందని, అక్కడనే శవాలను దహనం చేయాలని దళిత వర్గాలు పట్టుబట్టాయి. కాదు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పెడుతున్నాం అక్కడనే పడుతామంటూ మరో వర్గం పట్టుబట్టడంతో గ్రామంలో గోడవలు జరిగాయి. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు కూడ చేసుకున్నారు. దళత ఇండ్ల మద్యన శవాలను పూడ్చవద్దంటూ గ్రామానికి చేందిన ఒ వ్యక్తి చేవెళ్ల ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై ఎక్కి పెట్రోల్ పోసుకుని అత్మహత్య యత్నం చేశారు. సకాలంలో చేవెళ్ల ఎసిపి ప్రబాకర్, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు ఖయ్యుం, ప్రదీప్‌కుమార్‌లు స్పందించి ప్రమాదం నుండి కాపాడారు. అత్మహత్య పరిష్కారం కాదని, సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య దామరిగిద్ద గ్రామంలోని సమస్యకు నాకు ఏలాంటి సంబంధంలేదని, సమస్యలను వెంటనే పరిష్కిరించాలని సంబందిత అధికారులను అదేశించారు. చేవెళ్ల ఏసిపి ప్రభాకర్, అర్డిఓ వేణుమాదవరావులు పలు దఫాలుగా దామరిగిద్ద గ్రామానికి చేందిన ఇరువర్గాలను పిలిచి సమదాయించారు. గ్రామంలో సమస్యలు ఉత్పన్నం కాకూడదని, అందరూ అన్నిదమ్ములుగా కలిసి మెలిసి ఉండాలని చేవెళ్ల ఏసిపి ప్రభాకర్, అర్డిఓ వేణుమాదవరావులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రభుత్వ అదేశాలకు ప్రతి ఒక్కరుకట్టుబడి ఉండాలని, గ్రామంలో అందరు సమానమేనని, ఎవరైన గోడవలు సృష్టిస్తే చర్యతు తీసుకుంటామని పోలీసులు తమదైన శైలిలో హెచ్చరికలు జారీ చేశారు. చేవెళ్ల ఆర్డిఓ వేణుమాదవరావు అదేశాల ప్రకారం తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటి తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ రాజేష్, సర్వేయర్ మల్లేష్,విఆర్ఎ శంకర్‌ల బృందం గతంలో కేటాయించిన వైకుంఠదామకు అనుకుని స్దలం ఉందని, అకారులు సర్వే చేసి అదనంగా దామరిగిద్ద గ్రామ వైకుంఠదామంకు స్దలంను కేటాయిస్తున్నట్లు చేవెళ్ల ఎంపిడిఓకు అదేశాలు జారీ చేశారు. అదికారులు అదనంగా స్దలం కేటాయించడంతో వివాదం సద్దుమనిగింది. దామరిగిద్దలో వైకుంఠదామకు అనుకుని ఉన్న సర్వేనంబర్ 150లో అదనంగా మరో ఎకరం భూమిని కేటాయిస్తున్నట్లు చేవెళ్ల తహసీల్దార్ శ్రీనివాస్ లెటర్ నంబర్ బి 563 2023 తేది 15.04.2023ను ఎంపిడిఓ అర్డర్ కాపీని అందజేశారు. వైకుంఠదామంకు సంబందించిన పనులను ఎంపిడిఓ పర్యవేక్షణలో కోనసాగుతన్నాయి. దామరిగిద్దలో అదనంగా వైకుంఠ దామంకు మరో ఎకర భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందని, పనులు ప్రారంబీంచాలని సంబందిత గ్రామ కార్యదర్శికి అదేశాలు జారీ చేశారు. దామరిగిద్ద గ్రామంలో వైకుంఠదామం పనును గ్రామ పంచాయతీ అధికారులు చేపట్టారు. అధికారుల చోరవతో దామరిగిద్ద వివాదం పూర్తిగా సద్దుమణిగింది. చేవెళ్ల ఎసిపి ప్రభాకర్, ఆర్డిఓ వేణుమాదరరావులు ప్రత్యేక శ్రద్ద తీసుకుని సున్నతమైన అంశంను చాకచక్యంగా ఇరువర్గాలకు అవగాహన కల్పించారు. వార్త కథనంకు అధికారుల స్పందించి స్దలంను మంజూరు చేసి వివాదంకు పుల్‌స్టాప్ పెట్టారు.

**(వార్తకు స్పందన )**

**-ఇరువర్గాలతో పలుమార్లు చర్చలు**

**-ఎసిపి ప్రభాకర్,ఆర్డిఓ వేణుమాదవరావు చొరవతో సద్దుమణిగిన వివాదం**

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

పేద ప్రజల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయంగా పథకాలను ప్రవేశపెట్టామని, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌కు మాత్రమే దక్కుతుందని చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు.సోమవారం చేవెళ్ల ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయనిది, కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను, ముస్లిం మైనారిటి సోదరులకు రంజాన్ కానుకలను అందజేశారు. 25 మంది లబ్దిదారులకు 9,23,000 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను, 27 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, 14 మంది లబ్దిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్బంగా చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పలు పథకాలను పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలను పక్కగా అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అనేక పథకానలు పేదలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ముస్లింలకు రంజాన్ కానుకలను కూడ అందజేసిన ఘనత సిఎం కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డిఓ వేణుమాదవరావు, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, మండల పార్టీ అద్యక్షుడు ప్రభాకర్, నాయకులు మర్పల్లి క్రిష్టారెడ్డి,కుంచం శివకుమార్, బాసీత్, కోత్తకాపు ప్రభాకర్‌రెడ్డి, ఎన్ను జంగారెడ్డి, సర్పంచులు శ్రీనివాస్, శైలజ, జాంగీర్,శివారెడ్డి, ఎంపిటిసి నరేందర్,మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నర్సింలు తదితరులు పాల్గోన్నారు.



చేవెళ్లలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కలను అందజేస్తున్న చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య

## బ్రతికినన్నాళ్ళు బంధాలను కలుపుకొని కలిసికట్టుగా జీవించాలి : సర్పంచ్ మోహన్‌రెడ్డి



పోటోరైటప్: కందనెల్లిలో బలగం సినిమా చూస్తున్న సర్పంచ్ తదితరులు

**పెద్దేముల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** బ్రతికినన్నాళ్ళు కుటుంబ బంధాలను కలుపుకొని కలిసికట్టుగా జీవించాలని సర్పంచ్ టి.మోహన్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో ఆదివారం రాత్రి బలగం సినిమా ఏర్పాటు చేశారు. గ్రామస్థులే తన బలగం అంటు కందనెల్లి గ్రామ ప్రజలతో పాటు కూర్చొని వీదిలో ఏర్పాటు చేసిన బలగం సినిమాను వీక్షించారు. ఈ సందర్బంగా సర్పంచ్ టి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతిఒక్కరు కలిసికట్టుగా ఉంటు అభివృద్ది చెందాలని, తమ అభివృద్దితో పాటు సమాజం అభివృద్ది చెందెందుకు కృషిచేయాలని అన్నారు. పుట్టినప్పుడు ఏమి తీసుకురాడు, పోయిననాడు ఏమి తీసుకుపోడు అనే మాటను గుర్తించుకొని సమాజ సేవకు పాటు పడుతు మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని అన్నారు. బ్రతికినన్నాళ్ళు బందాలను, బందుత్వాలను కలుపుకొని సుఖసంతోషాలతో జీవించాలని అన్నారు. కందనెల్లి గ్రామస్థులంతా నా బలగం అని, ప్రజలంతా నా కుటుంబ సభ్యులని అన్నారు. ఈ కార్యక్రమంలో అంపల్లి రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రం పౌరాణిక నాటకాలకు ప్రసిద్ధి

### -సర్పంచ్ సంధ్యా భాస్కర్‌రెడ్డి

**పూడూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం పౌరాణిక నాటకాలకు ప్రసిద్ధిగాంచిందని సర్పంచ్ సంధ్యా భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం రాత్రి పూడూరు మండలం పరిధిలోని సోమన్‌గుర్తి గ్రామంలో శివగంగ కళ్యాణం అనే వీధినాటకాన్ని గ్రామ కళాకారులు ప్రదర్శిస్తుండగా,సర్పంచ్ పాల్గొని ఒకలక్షా రూపాయల విరాళం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యక్షగానం,భాగవతం,చిరుతల భజనలు వంటి వీధి నాటకాలకు ప్రజలు మంచి ప్రాధాన్యతను ఇస్తారని వివంచారు. ప్రస్తుత సమాజం టివి సెల్ పోన్లు వాడకంవల్ల వీధినాటకాలు కనుమరుగవుతున్న తరణంలో కళాకారులు శివగంగ కళ్యాణం వీధినాటకం ఆడటం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేశం,వార్డు సభ్యులు బుచ్చన్న,మజీద్,ఎస్ఎంసి చైర్మన్ వెంకటేష్,నాయకులు జంగయ్య,సత్యయ్య,రామస్వామి,బాల్‌రాజ్ పాల్గొన్నారు.

## ఐకెపి వివోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### -మండల ఐకెపి వివోఏల సంఘం అధ్యక్షుడు గోపాల్,ఉపాధ్యక్షుడు శ్రీశైలం



పూడూరు మండలం ఐకెపి కార్యాలయం ముందు జరిగిన నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఐకెపి విఓఏలు తదితరులు

**పూడూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**

ఐకెపి విఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల ఐకెపి విఓఏల సంఘం అద్యక్షుడు గోపాల్,ఉపాధ్యక్షుడు శ్రీశైలం డిమాండ్ చేశారు.సోమవారం పూడూరు మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం ముందు ఐకెపి విఓఏలతో కలిసి నిరవధిక సమ్మెను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఐకెపి విఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి,ఉద్యోగ భద్రత కల్పించాలని,కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని,రూ.10 లక్షలతో సాధారణ భీమా,ఆరోగ్యభీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.సెర్ప్‌నుండి ఐడి కార్డులు ఇవ్వాలని,గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు చెల్లించాలని,విఓఏలతో ఆన్‌లైన్ పనులు చేయించకూడదని,మహిళా సంఘాల వత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్‌హెచ్‌జిలకు విఎల్ఆర్ అభయహస్తం డబ్బులు చెలించాలని కోరారు.ఎస్‌హెచ్‌జి,వివోలైవ్ మీటింగ్ రద్దు చేయాలని,అర్హులైన విఓఏలను సిసిలుగా ప్రమోషన్ కల్పించాలని అన్నాం ఈ కార్యక్రమంలో విఓఏలు రమాదేవి,అలవేలు,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలి

### -ఎమ్మెల్యే ఆనంద్

**వికారాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందజేస్తూ, పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో కార్పొరేటు స్థాయి వైద్య సేవలు అందజేసేలా కృషి చేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. పట్టణంలోని ఎంఆర్‌పీ చౌరస్తాలో సోమవారం మైత్రి ప్రైవేటు ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికారాబాద్ ప్రాంతం విద్యాపరంగానే కాక వైద్యపరంగా ప్రాముఖ్యత ు సంతరించుకుంటున్న పరిస్థితులలో మైత్రి ఆసుపత్రి ఏర్పాటు శుభ పరిణామం అన్నారు. బీసీ కమీషన్ సభ్యులు ఎన్.శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ, వికారాబాద్ ప్రాంతంలో విద్యనభ్యసించి వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి వికారాబాద్ ప్రాంత వాసులకు వైద్య సేవలు అందించాలనే నిర్ణయించుకున్న ఆసుపత్రి నిర్వాహకుల ఆలోచన అభినంధనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మైత్రి ఆసుపత్రి డైరెక్టర్లు డాక్టర్ కె.శ్రావణ్ కుమార్, డాక్టర్ కె.సుఖప్రద, స్థానిక కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు సుధాంశ్ కిరణ్ పటేల్, దేవదాస్, కృష్ణయ్య, నరోత్తంరెడ్డి, వై.సత్యనారాయణ రెడ్డి, పి.రాంరెడ్డి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**కొడంగల్,ఏప్రిల్ 17ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణ శివారులోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సందర్శించారు.సోమవారం ఉదయం వేళల్లో మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు.పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.అలాగే పాఠశాల విద్యార్థులతో ఆహారం,నీటి వసతి తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.గురుకుల పాఠశాలకు సంభందించిన సీసీ రోడ్డు విషయంపై సంభందిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తు వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అంతకుముందు పట్టణంలోని సన్‌సిటి కాలనీలోని రెడ్డిబసిరెడ్డి ఫంక్షన్‌హాల్ వెనుకా ఉన్న రోడ్డు విషయంలో రైతులతో ఎమ్మెల్యే చర్చించి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కొడంగల్ మున్సిపల్ కేంద్రంలోని బండల ఎల్లమ్మ దేవాలయం సమీపం నుంచి తిర్లపురం అడవి రోడ్డుకు సంభందించి సీసీ రోడ్డు నిర్మాణం పై ఎమ్మెల్యే పరిశీలించారు.ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు దాసప్పయాదవ్,నవాజ్,సముద్రమ్మ తదితరులున్నారు.

## అంతారం సర్పంచ్ అత్యుత్సాహం

### -తాగునీటికి రోడ్డెక్కిన మహిళలు

### -ప్రశ్నించిన మహిళలపై బూతుపురాణం!



కాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

**కుల్కచర్ల ఏప్రిల్ 17, ప్రభాతవార్త;**

తాగునీరు లేకుండా ఇబ్బందులు పడుతున్నామని నీళ్లకోసం అడిగిన పాపానికి అసబ్య పదజాలంతో దూషించిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాల ని మహిళలు డిమాండ్ చేశారు.సోమవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిదిలోని పెద్ద అంతారం గ్రామంలోని గ్రామ పంచాయతి ఆవరణలో భారి సంఖ్యలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంత కాలంగా నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఊరికి మంచి చేస్తాడని సర్పంచ్‌గా గెలిపిస్తే సమస్యలు పరిష్కరించగ పోగా అసబ్య పదజాలంతో దూషిస్తున్నాడని స్థానిక ఎస్‌సి కాలనీలో బోరు మోటరు దగ్గర ఉన్న సర్పంచ్‌ను నిలదీయగా గొడవకు దిగాడని అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఆరోపిస్తున్నారు.గ్రామ ప్రథమ పౌరుడిగా గ్రామ సమస్యలు పరిష్కరించాల్సిన సర్పంచ్ మద్యం మత్తులో మహిళలు అనికూడా చూడకుండా ఇష్టారీతిన బూతులు మాట్లాడడం సరికాదని వారు తెలిపారు.

**నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే : సర్పంచ్**

అంతారం గ్రామంలో నీటి సమస్య ఉన్నది వాస్తవమేనని సమస్యను అధిగమించేందుకు శ్రమిస్తున్నట్టు సర్పంచ్ దగ్గుల కృష్ణయ్య తెలిపారు.మహిళలను కించపరిచేలా మాట్లాడలేదని పాత కక్ష్యలను మనసులో ఉంచుకుని తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.గ్రామంలో ట్యాంకర్ల ద్వార నీటిని సరఫరా చేశామని ఆయన తెలిపారు.

## ఇమాం మౌజమ్‌లకు బట్టల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**దౌల్తాబాద్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండల కేద్రంలోని జమియా మజీద్ దగ్గర రంజాన్ పండుగ సంధర్భంగా ప్రభుత్వం కానుకగా మండలంలోని జమియా మస్జీద్‌జల ఇమామ్ మౌజంలకు ఆదివారంరోజు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బట్టల పంపిణీ చేశారు.ఈ సంధ్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రతి ఏటా మైనార్టీల సంక్షేమంకోసం అహర్నిషలు పని చేస్తుందని అన్నారు.అనంతరం మండలంలో ఈద్గా పనులు ఎంత వరకు వచ్చాయే అధికారులను అడిగి తెలుసుకున్నారు.మండల కేంద్రంలో కొంత అనివార్య కారణాల వల్ల ఈద్గా పనులను పెండింగులో ఉండడంతో వెంటనే ఆయోక్క ఈద్గా పనులను ప్రారంభించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి,ఎంపీపీ విజయ్‌కుమార్,జడ్పీటీసీ కోట్ల మహిపాల్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రమోద్‌రావ్,గ్రామ సర్పంచ్ శిరీషరమేష్,మండల తహశీల్దార్ కృష్ణయ్య,నాయకులు పకిరప్ప,నరోత్తంరెడ్డి,మైనార్టీ నాయకులు అబ్దుల్‌వహబ,జావిద్,అక్రమ్,అయుబ్,సయ్యద్,జిలానీ,వివిధ గ్రామాల పార్టీనాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : ఎస్ఐ శంకర్

**బొంరాస్‌పేట్,ఎప్రిల్17,ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి ఆదేశాల మేరకు బొంరాస్‌పేట్ మండల పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి 163పై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని ఎస్ఐ శంకర్ తెలిపారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని,వాటి నివారణ కోసం వివిధ మండలాల్లో వాహనాలు,సంబంధిత పేపర్లు,హెల్మెట్స్‌ను గుర్తించాలనే వారి ఆదేశానుసారం బొంరాస్‌పేట్ మండలంలో ఇప్పటి వరకు 6వందలకుపైగా వాహనాలను గుర్తించడం జరిగిందని అయన తెలిపారు.అలాగే మండల పరిధిలో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారిపై బుర్రితాండా నుండి రేగడిమైలారం వరకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని,ప్రమాదాల నివారణ కోసం సూచికబోర్డులను ఏర్పాటుచేయడంతోపాటు అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని అయన తెలిపారు.బోట్లోనితాండ, తుంకిమెట్ల మధ్యలో ఉన్న పార్కింగ్ స్థలంలో ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో అక్కడ ఒక బరికేట్లు,సూచికబోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని దీని ద్వార అక్కడ ప్రమాదాలు జరగడంలేదని అన్నారు.ఆదేవిధంగా వాహనదారులు ప్రమాదాలు జరగకుండా హెల్మెట్స్ ధరించడంతోపాటు రోడ్డు భద్రత నియమాలను పాటించి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ శంకర్ వాహనదారులకు సూచించారు.

## మాంసం వ్యర్థాల సేకరణకు 19న బహిరంగ వేలం

**తాండూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**

తాండూరు మున్సిపల్ పరిధిలో మాంసం వ్యర్థాల సేకరణకు బహిరంగ వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలో చికెన్, మటన్, ఫిష్ తదితర వ్యర్థాల సేకరణకు ఈ నెల 19న తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని కమిషనర్ సూచించారు.

## రంజాన్ కానుకగా బట్టల పంపిణీ



బట్టల పంపిణీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.

**బొంరాస్‌పేట్,ఏప్రిల్17,ప్రభాతవార్త :**

రంజాన్ వేడుకలలో భాగంగా ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బొంరాస్‌పేట్ మండలకేంద్రంలో రంజాన్ పండుగా కానుకగా మజీద్‌ల ఇమామ్,మౌజంలకు బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలు,మతలకు సమాన ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందన్నారు.మండల పరిధిలోని 18మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందించడం జరిగిందని,పేదమహిళలకు 1లక్ష 1వంద 16రూపాయాల ఆర్థికసమయం అందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## తట్టెపల్లిని మండల కేంద్రంగా వెంటనే ప్రకటించాలి

### -మండల సాధన సమితి ఉపాధ్యక్షులు గోపాల్, కార్యదర్శి శంకర్





రిలే నిరహర దీక్షలో పాల్గొన్న మండల సాధన సమితి సభ్యులు

**పెద్దేముల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తట్టెపల్లిని మండల కేంద్రంగా వెంటనే ప్రకటించాలని మండల సాధన సమితి ఉపాధ్యక్షులు గోపాల్, కార్యదర్శి శంకర్ అన్నారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి చౌరాస్తలో నిర్వహిస్తున్న రిలే నిరహర దీక్ష సోమవారంతో 10వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా గోపాల్, శంకర్ మాట్లాడుతూ పెద్దేముల్ మండల కేంద్రానికి వెళ్ళడానికి ఎంతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. విద్య, వైద్యం కోసం తాండూరు,పెద్దేముల్ వెళ్ళాలంటే ఎంతో ఖర్చుతో పాటు సమయం కూడా వృథా అవుతుందని అన్నారు. తట్టెపల్లి గిరిజన ప్రాంతమే కాకుండా కర్ణాటక బార్డర్‌కు దగ్గరగా ఉన్నందున అభివృద్ధికి నోచుకోవడంలేదని అన్నారు. అన్ని అర్హతలున్న తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి సభ్యులు జగన్,పండరి, రామప్ప, చంద్రప్ప, మహబూబ్, సలీం, ఖలీల్, ఖయ్యూం, సంగప్ప, రాములు, అంజయ్య, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కరుణాకర్‌రెడ్డి మరణం చాలా బాధకరం : ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, ఏప్రిల్ 17, (ప్రభాతవార్త) :** కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి మరణం చాలా బాధకరమైన విషయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కరుణాకర్‌రెడ్డి హత్యను ఖండిస్తూ అతని ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి మౌనం పాటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ... కరుణాకర్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలిజేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. మౌనం పాటించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## 24,25 తేదీల్లో సంత్ సేవాలాల్,భవాని మాతా ఉత్సవాలు

**యాలాల ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** యాలాల మండలం భాణాపూర్ గ్రామంలో ఈ నెల 24,25 తేదీల్లో సేవాలాల్ జయంతి,భవానీ మాతా ఉత్సవాలు నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ వర్మ్యా విఠల్‌నాయక్ తెలిపారు.సేవాలాల్ ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని సుమారు 150మంది గిరిజన మహిళలకు సాంప్రదాయ వస్త్ర ధారణ దుస్తుల కొనుగోలు కోసం రూ.2 లక్షలు విఠల్‌నాయక్ అందించారు.ఈ నగదును గ్రామ సర్పనంచుబాలీబాయికి 2లక్షల నగదును సోమవారం అందించారు.ఈ సందర్భాంగా విఠల్ మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలు తెరమరుగు కాకుండా ప్రతి గిరిజన మహిళకు దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. రూ.2లక్షలు అందించడం పట్ల గ్రామస్తులు విఠల్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచుతో పాటు గ్రామ మహిళలు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.